క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



భట్టిప్రోలు : ఎరువులు, పురుగుమందుల దుకాణదారుల వద్ద అమ్మకాలు చేపడుతున్న నిల్వలకు సంబధిత పత్రాలు తప్పనిసరిగా ఉండాలని విజిలెన్స్ బృందం ఏడీఏ పి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఆయన సిబ్బందితో కలసి తనిఖీలు జరిపారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించిన ఆయన అమ్మకాలు చేపట్టిన రూ.41 వేలు విలువైన బయో ఉత్పత్తులకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సరుకు అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఎరువుల అమ్మకాలకు అవసరమైన ఫామ్ ఓ, విత్తనాల అమ్మకందారులు ఫారం సీ, బయో ఉత్పత్తులకు జీ 2, జీ 3 తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ ఎ.లక్ష్మి, భట్టిప్రోలు ఏవో బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఎక్సరే కేంద్రం ప్రారంభం



వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ జెరీనా పర్విన్ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్సరే కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన అన్ని రోగాలకు ఎక్సరే తీయడం జరుగుతుందని, గతంలో ఇక్కడ ఎక్సరే కేంద్రం లేక రోగులు చాలా ఇబ్బందులు పడ్డారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మెంబర్లు వేల్పుల రవి ప్రసాద్, గొట్టిపాటి నరహరి ప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులకు మాజీ సైనికులు చేయూతనందించటం అభినందనీయమని మాజీ సైనికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. మండలంలోని సమ్మెటవారిపాలెంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధమైన బాధితుడు సమ్మెట శ్రీనివాసరెడ్డికి మాజీ సైనికులు రూ.12 వేల నగదు బుధవారం తాండ్ర సాంబశివరావు చేతుల మీదుగా అందజేశారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు చేయూతనందిస్తే ఆ కుటుంబాలు త్వరగా కోలుకుంటాయని సాంబశివరావు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, మాజీ సైనికులు వెంకటకృష్ణారావు, మొహిద్దీన్, శేషగిరిరావు, సాంబశివారెడ్డి, రెడ్డి సేవామిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి ఉన్నారు.

118 కిలోల బరువు ఉన్న గర్భిణికి ఆపరేషన్



వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వైద్యాధికారి సయ్యద్ జెరీనా పర్విన్ అన్నారు. వేమూరు గ్రామానికి చెందిన ఒక మహిళ 118 కిలోల బరువు ఉన్న మహిళకు బుధవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ చేసి మగ బిడ్డను తీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలలలో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వేమూరుకు చెందిన 118 కిలోల బరువు గల ఒక మహిళ వివాహం అయి 11 సంవత్సరాలు అయినా మూడు సార్లు గర్భం పోగా, గర్భం నిలవకపోవడంతో సీహెచ్‌సీకి వచ్చిందని తెలిపారు. ఆమెకు సకాలంలో సలహాలు, వైద్య సేవలు అందించి, మందులు వాడటం వల్ల మగ బిడ్డకు జన్మనివ్వడం జరిగిందన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య సేవలు పొందాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అంగలకుదురు విద్యార్థులు

తెనాలిరూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తెనాలి మండలం అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో మంగళవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్ పోటీల్లో అంగలకుదురు విద్యార్థులు సీహెచ్ కరుణ, సీ.హెచ్. ఆంజనేయులు 100 మీటర్ల విభాగంలో, వి.విజయసాయి భవాని శేఖర్ 60 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. బాపట్ల జిల్లాలో త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

ఎండైనా.. వానైనా.. నో షెల్టర్

- బస్సుల కోసం రహదారి పక్కనే నిరీక్షణలో ప్రయాణికులు
- రేపల్లె నియోజకవర్గంలో బస్సు షెల్టర్ల కొరతతో అవస్థలు



రేపల్లె అంకమ్మ చెట్టు సెంటర్‌లో బస్సుల కోసం రహదారి పక్కన వేచి ఉన్న ప్రయాణికులు

రేపల్లె: రేపల్లె పట్టణం, గ్రామాలు అనేకం ఇప్పటికీ కనీసం బస్సు షెల్టర్ల లేని దుస్థితిలో ఉన్నాయి. ప్రజలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సు కోసం దూర దూరాల నుంచి వచ్చే వాహనాల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా అంకమ్మచెట్టు సెంటర్, ఓల్డ్‌టౌన్, చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్, రేపల్లె మెయిన్ రోడ్, నగరం వంటి జన సంచార ప్రాంతాల్లో రోజూ వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ అక్కడ కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేవు... తలదాచుకునే షెల్టర్ లేదు... ఆలస్యంగా వచ్చే బస్సుల కోసం అంతసేపు ఎండలో నిలబడటమే కష్టమయితే, వర్షాకాలంలో వర్షంలో తడవడం మరో వేదనగా మారింది. రేపల్లె నియోజకవర్గంలో బస్సు షెల్టర్ల కొరతతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

గంటల తరబడి వేచి ఉండాలి

ఓల్డ్ టౌన్ ప్రధాని కూడలిలో బస్సు షెల్టర్ లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి ప్రధాన కూడలిలో నిత్యం తెనాలి, విజయవాడ, గుంటూరు, పొన్నూరు, బాపట్ల, చీరాల, ఒంగోలుతోపాటు కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, మోపిదేవి, మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది.

రహదారి పక్కనే...

రేపల్లె పట్టణంలోని అంకమ్మ చెట్టు సెంటర్, ఓల్డ్ టౌన్, మండల కేంద్రమైన చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్, నగరం మెయిన్ రోడ్ సెంటర్లలో బస్సు షెల్టర్ లేకపోవడంతో రహదారి పక్కన ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కంపోస్ట్ పాయింట్‌ను ఎత్తివేయాలని వినతి



కమిషనర్ సాంబశివరావు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు

రేపల్లె: పట్టణంలోని పెద్ద కూరగాయల మార్కెట్ వెనక వైపు ఉన్న కంపోస్ట్ పాయింట్‌ను ఎత్తివేయాలని, పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచాలని పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ బాబు మాట్లాడుతూ పెద్ద కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న కంపోస్ట్ పాయింట్‌లో కూరగాయల వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాలు పడవేసి రోజుల తరబడి తొలగించకపోవడంతో అవి కుళ్లి భరించలేని దుర్గంధం వెదజల్లుతుందన్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్కడ కంపోస్ట్ పాయింట్‌ను ఎత్తివేసి శుభ్రపరచాలని కోరారు. అదేవిధంగా పటేల్ స్కూల్ రోడ్డు, కుప్పం వారి వీధిలో మురుగు కాలువలు పారుదల లేక చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్నాయని, పూడికలు తీయించాలని కోరారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక సభ్యులు సాయికృష్ణమాచార్యులు, ఆనంద్, 6వ వార్డు వాసులు తదితరులు పాల్గొన్నారు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు : కొల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

నిజాంపట్నం: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతిరావు తెలిపారు. అడవులదీవి పోలీసు స్టేషన్ పరిధిలోని నక్షత్రనగర్ బీచ్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో బుధవారం సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9,250 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడి చేసిన వారిలో అడవులదీవి ఎస్ఐ బి.బాబూరావు తదితరులున్నారు.

మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు



ఎస్ఐ ఎం.శివయ్య

భట్టిప్రోలు: యువత మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ఎం.శివయ్య కోరారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, కార్మికులకు గంజాయి, పునరావాస కేంద్రంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు పడితే కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని, యువత మత్తుకు బానిసలై జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం, సరఫరా చేయడం వంటివి చేస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో రేపల్లె పట్టణంలోని అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, కోట సెంటరు, అంకమ్మచెట్టు సెంటరు, గూనివారిపాలెం, చిన్నఅరవపల్లి గ్రామాలలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్ బాబు బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బంగారు కుటంబాల సర్వేకు గ్రామ సభలు

చుండూరు(వేమూరు): గ్రామీణ ప్రాంతాల్లో బంగారు కుటుంబాలను సర్వే చేసేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సుదీప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. బుధవారం అంబేడ్కర్‌నగర్, మున్నంగివారిపాలెం, తొట్టింపూడిలో గ్రామ సభలు నిర్వహించారు. 17న చినపరిమి, పెదగాదెలవర్రు, 18న దుండిపాలెం, యడ్లపల్లి, 19న మోదుకూరు 1, 2, సచివాలయాలు, 21న చుండూరు, పెనుగుదురుపాడు, 22న వలివేరు, వేటపాలెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

నారుమడుల్లో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలి



ఓలేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి, సిబ్బంది, రైతులు



కూచిపూడిలో మాట్లాడుతున్న ఏవో భరత్‌కుమార్

ఏవో బి.బ్రహ్మారెడ్డి

భట్టిప్రోలు: నారుమడుల్లో తగినంత నీరు ఉండే విధంగా చూసుకోవాలని భట్టిప్రోలు మండల వ్యవసాయ శాఖాధికారి బి.బ్రహ్మారెడ్డి తెలిపారు. మండలంలోని ఓలేరు, గొరిగపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నారుమడిలో వేయాల్సిన పోషకాలు అందించడం ద్వారా ఎటువంటి సూక్ష్మధాతు లోపాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని పేర్కొన్నారు. వెద పద్ధతిలో నాటిన రైతులు, వెద పట్టిన 24 గంటల్లో పెండిమిథాలిన్ ఒక లీటర్ ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా కలుపు మొక్కలు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. యాజమాన్య పద్ధతులను గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు కె.లక్ష్మీప్రసన్న, టి.అఖిల, వీహెచ్ఏలు జి.జ్యోతి, ఎన్.కవిత, రైతులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

అమర్తలూరు(వేమూరు): ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రారంభం అయిందని, రైతులందరు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరు రైతు సేవా కేంద్రానికి వెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులందరు త్వరితగతిన కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు. పంట బీమా గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.



చదలవాడలో మాట్లాడుతున్న ఏవో కె.ప్రేమ్‌సాగర్

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

వేమూరు: వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ప్రీమియం ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రేమ్‌సాగర్ తెలిపారు. వేమూరు మండలంలోని చదలవాడ, కాకర్లమూడి, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. వెద సాగుకు కొద్ది పాటి నీరు అందించాలన్నారు. కౌలుదారులందరు కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు

కర్లపాలెం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగరాజుపాలెం, బోలాయపాలెం గ్రామాలలో గురువారం రచ్చబండ కార్యక్రమాలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రచ్చబండ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు నాగరాజుపాలెంలో, 5 గంటలకు బోలాయపాలెంలో రచ్చబండ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు



కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పిడపర్రు గ్రామం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని అన్నవరం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పామర్తి శ్రీరామకృష్ణ మరో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధుతో కలసి బైకు పై వల్లభాపురం గ్రామ సచివాలయంకు వెళ్తుండగా పిడపర్రు శివారులో రోడ్డుకు అడ్డంగా భారీ పాము ఎదురుపడింది. దీంతో సడన్ బ్రేక్ వేయటంతో బైకు అదుపుతప్పి ఇద్దరు క్రింద పడ్డారు. ఈ ఘటనలో శ్రీరామకృష్ణకు తీవ్రగాయాలవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్లు, కాల్వల నిర్మాణానికి శ్రీకారం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



శంకుస్థాపన చేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతి రావు

తెనాలిఅర్బన్: పట్టణంలో రోడ్లు, కాల్వలు నిర్మాణానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 11వ వార్డు గురవయ్య కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, కాల్వలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు మాట్లాడుతూ రూ.7.20 లక్షలతో వీటి నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పాల్గొన్నారు.

కార్మికులను రోడ్డుకీడ్చటం సుపరిపాలనేనా..?

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

రేపల్లె: కార్మికులను రోడ్డుకీడ్చటం సుపరిపాలనేనా అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకుంటూ కార్మికులను రోడ్డుకీడ్చుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచటంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన చంద్రబాబు నేడు నోరు మెదపటం లేదన్నారు. కనీసం జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమ దోచుకుంటోందన్నారు. సంపద సృష్టిస్తాం, సుపరిపాలన అందిస్తామంటూ హామీలిచ్చారేగానీ అమలులో శూన్యంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయపరమైందని సీపీఎం పార్టీ తరపున మద్దతు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. శిబిరంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకరరావు, రవి, రాఘవేంద్రరావు, సుబ్బారావు, అనూష, గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ



చిన్నారులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన ఎంఈవో-2 దేవరాజ్

భట్టిప్రోలు : విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ మండలంలోని అద్దేపల్లి భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష ఈఈడీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమలో ఎంఈవో-2 దేవరాజ్ పాల్గొని చిన్నారులకు వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్స్ తదితర పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా వారిని భవిత కేంద్రాలకు తీసుకొచ్చి ప్రతిభావంతులుగా తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సమగ్ర శిక్ష విభాగం నుంచి వివిధ భత్యాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసేవ సభ్యుడు బొలిశెట్టి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, సయ్యద్ షంషేర్ అలీ, సుభాషిణి, ఈఈడీ ఉపాధ్యాయులు మేరి ఇవాంజలిన్, కె.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన కల్పించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



పేరలి ఆయుష్ వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: వైద్యం కోసం వచ్చే రోగులకు ఆయుర్వేద మందులు పని చేసే విధానంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిధిలోని పేరలి గ్రామంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలను ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలోని సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాలలకు కావలసిన వసతులు సమకూరుస్తుందని ఆయుర్వేద మందులపై నమ్మకం కల్పించి అవసరమైన వారు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రతిరోజు నియమిత సమయాలలో వైద్యశాలను తెరచి ఉంచి రోగులకు సేవలందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ సిద్ధార్థ, సిబ్బంది ఉన్నారు.

వలివేరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

చుండూరు(వేమూరు): బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ద్వారా బాబు మోసాలను ప్రతి ఇంటికి తెలియజేయడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం మూడవ రోజు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు ఇంత వరకు పూర్తిగా అమలు చేయలేదని చెప్పారు. చంద్రబాబు నాయుడు ప్రజలను ఎలా మోసం చేసింది ప్రతి ఇంటికి తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో దాట్ల మోహన్ రెడ్డి, పందిపాటి ఏసు, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, బూదాటి సాంబయ్య, కొండమూడి ప్రసాద్, దాసరి వసంత రావు, కొండముది సుశీలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్య వర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

తెనాలిరూరల్: వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అని తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 90 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తెనాలి కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వం–దేశం కోసం అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి కొత్తపేట మీదుగా గాంధీ చౌక్ వరకు 1కే రన్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ కోర్టులో విచారణ వరకు వెళ్లకుండా తమ వివాదాలను పరిష్కరించుకునేందుకు ఉపయోగపక్షాలకు ఈ వివాదంతో సంబంధం లేని, మూడవ పక్షం సహాయం చేసే ప్రక్రియే మధ్యవర్తిత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం. ఇందిరాప్రియదర్శిని, పవన్ కుమార్, వివేక్ వర్ధన్, రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, న్యాయవాదులు పిల్లి రమేష్, భవాని, పారా లీగల్ వాలింటర్స్, మండల లీగల్ సర్వీసెస్ కమిటి సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి

తెనాలిరూరల్: అనుమానాద్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల వద్ద చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన దాసరి బాలస్వామి (20) గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నేహితులతో కలసి జగ్గడిగుంట పాలెంలోని టిడ్కో గృహాలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూడగా కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నా డు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు స్నేహితులపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పడి ఉంటాడని.. తమకు తెలియదని స్నేహితులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతి కింద రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.